క్లుప్తంగా

నేడు దేగరమూడికి మేరుగు నాగార్జున

పర్చూరు(చినగంజాం): దళిత యువకులను మార్టూరు సీఐ శేషగిరి అన్యాయంగా లాఠీలతో కొట్టి గాయపరచిన ఘటనకు సంబంధించి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మంగళవారం దేగరమూడి గ్రామానికి వెళ్లనున్నారని పార్టీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దేగరమూడి చేరుకొని గ్రామంలో బాధితులను పరామర్శించనున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి వ్యక్తిగత కారణాల వలన హాజరు కావడం లేదని తెలిపారు.

నేడు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసన

పర్చూరు (చినగంజాం): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బాపట్లలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పిలుపు మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు మేరుగు నాగార్జున ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై విజయ వంతం చేయాల్సిందిగా కోరారు.

రేపు కారంచేడు మండల పరిషత్ సమావేశం

కారంచేడు: అక్టోబర్ 1వ తేదీ బుధవారం కారంచేడు మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంమ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు మండలంలోని అన్ని శాఖల అధికారులు మీ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ గర్భిణులకు సేవలు

అద్దంకి: ప్రతి ఏఎన్ఎం, ఆశావర్కర్ తాము పని చేసే ప్రాంతంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ గర్భిణులను గుర్తించి సేలందించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ బీవీ సాగర్ అన్నారు. ఎయిడ్స్ రోగుల పిల్లలకు ఆ వ్యాధి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి వివరించాలని చెప్పారు. కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని గరటయ్య కాలనీలో నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనలో అందరూ పాలు పంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో దుర్గ భవాని, డీవీ సుజాత, మేరి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా అమ్మవారు



అద్దంకి రూరల్/కారంచేడు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక దత్తపాదుకా క్షేత్రంలోని అమ్మవారిని సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక భవాని సెంటర్‌లోని శ్రీవింధ్య వాసిని సమేత నగరేశ్వర స్వామి (వేయి స్తంభాల దేవాలయం) ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు.





అక్రమంగా తరలిస్తున్న బల్లికురవ పోలీస్ స్టేషన్ చేరిన గ్రానైట్ లారీలు (ఫైల్)



ఈర్లకొండ వద్ద ఎగుమతికి సిద్ధంగా ఉన్న గ్రానైట్ రాళ్లు

అక్రమార్కులకు అడ్డుకట్ట పడేనా ?

- బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, అద్దంకి మండలాల్లో 54 చెక్‌ల పోస్టుల ఏర్పాటు
- నెలకు రూ.47 కోట్లు చెల్లించేలా రెండేళ్లపాటు ఒప్పందం

బల్లికురవ: గ్రానైట్, మెటల్, ఇసుక గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ఏ ఎంఆర్ సంస్థకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకునే బాధ్యతను అప్పగించింది. అక్టోబర్ 1 నుంచి బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి, మార్టూరు మండలాల పరిధిలో సీనరేజ్ వసూలుకు 54 ప్రాంతాలను గుర్తించారు. వారం రోజుల క్రితమే ఆయా ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటుకు కంటైనర్లు తెచ్చి దించారు. అక్రమ రవాణాదారులు హడలెత్తిపోతూ కంటైనర్లను సైతం ధ్వంసం చేస్తున్నారు. నెలకు రూ.47 కోట్లు చెల్లించేలా రెండేళ్లపాటు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలను భూగర్భ గనుల శాఖ అధికారులు ఇప్పటికే తెలియజేసి ఇటీవలే మార్టూరులో ఏఎంఆర్ సంస్థతో సీనరేజ్ చెల్లింపుపై గ్రానైట్ ఎగుమతి దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

కంటైనర్లు ధ్వంసం..

చెక్ పోస్టులు ఏర్పాటుతో అక్రమ రవాణా దారుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయింది. రాజకీయ నాయకుల అండదండలతో కప్పం చెల్లిస్తూ బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల నుంచి నిత్యం సుమారు 500పై చిలుకు గ్రానైట్ ముడి పలకలు, గ్రావెల్ లారీలు సరిహద్దులు దాటుతున్న అధికారులు నెలసరి మాములతో చూసి చూడనట్లుగానే వదిలేస్తున్నారు. అద్దంకి మార్టూరు బల్లికురవ మండలాల నుంచి ఎర్ర గ్రావెల్, మెటల్ అక్రమంగా తరలడంతో కొండలు సైతం ఆనవాళ్లు కోల్పోయి కరిగిపోతున్నాయి. అక్రమ రవాణా దారులు ఇటీవల బల్లికురవ మండలంలోని కొనిదెన, కే రాజుపాలెం, మల్లయపాలెం, అద్దంకి మండలంలోని ధర్మవరం వద్ద ఏర్పాటు చేసిన కంటైనర్‌ల అద్దాలను పగులగొట్టారు.



ధర్మవరం సమీపంలో కంటైనర్ అద్దాలు పగులగొట్టిన దృశ్యం



గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్

తీర్మానాలతోనే సరి.. పనులు ఎక్కడా !



వార్డులో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

- పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ధ్వజం

చీరాల అర్బన్: నెలవారీ జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలలో అభివృద్ధి పనులను ఆమోదిస్తూ తీర్మానాలు చేస్తున్నారే వార్డుల్లో పనులు మాత్రం ప్రారంభించడం లేదంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్‌లో చైర్మన్ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావు అధ్యక్షతన మున్సిపాలిటిలోని కౌన్సిల్ హాలులో జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఎక్స్‌అఫిషియో హోదాలో హాజరయ్యారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ 12,13 వార్డుల్లో ఎన్నో సంవత్సరాల నుండి డ్రైనేజి, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెహ్రూ కూరగాయల మార్కెట్‌లో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారస్తులు ఒకే చోట ఉండడం వలన రిటైల్ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని, హోల్‌సేల్ వ్యాపారస్తులకు వేరే చోట ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ 28వ వార్డు కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు మూడు నెలల క్రితమే కౌన్సిల్ తీర్మానించిందని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించ లేదన్నారు. మరో రెండు నెలలు గడిసిస్తే నిధులు వెనక్కి వెళ్లిపోతాయన్నారు.

టెండర్లు పిలవని అధికారులు..

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బత్తుల అనిల్ మాట్లాడుతూ 29వ వార్డు పరిధిలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన వంద కుటుంబాలు ఉన్నాయని, రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ నిధులతో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు వేయాలని 2023లో కౌన్సిల్‌లో ఉంచినా టెండర్లు పిలవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ మాట్లాడుతూ ఖాళీ స్థలాలో చిల్లచెట్లు ఎక్కువగా ఉండడం వలన స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కో ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్ మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో ఎంతో మంది క్రీడాకారులు కఠోర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారన్నారు. కాని ప్రస్తుతం వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీ గ్రౌండ్‌లోకి రాకుండా తాళాలు వేశారన్నారు. అనంతరం అజెండాలోని 35 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. చీరాల ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో కమిషనర్ ఎస్‌డీ అబ్దుల్ రషీద్, డిఈ రంగనాథ్, టిపిఓ కె.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



అద్దంకిలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు



చీరాలలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన పార్టీ శ్రేణులు

చీరాల అర్బన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని.. వారికి అండగా వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు సూచనల మేరకు సోమవారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అమానుషంగా దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అక్రమ కేసులు, దాడులు చేస్తున్న వారి వివరాలను బాధితులు డిజిటల్ బుక్‌లో నమోదు చేసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందులో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఎవరూ కూటమి నాయకులు, అక్రమ కేసులపై భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వేటపాలెం మండల అధ్యక్షులు సాధు రాఘవరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వాసిమళ్ల వాసు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు గోసాల అశోక్, మాజీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వేటపాలెం మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం మహేష్, వేటపాలెం మండల మాజీ అధ్యక్షుడు బి.సుబ్బారావు, రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లి బాబూరావు, గొట్టిపాటి భాగ్యరాజు, వెంకట్‌రాజు, తొట్టెంపూడి వినయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొరిశపాడులో డిజిటల్ బుక్ ఆవిష్కరించిన నాయకులు

జగనన్న ఇచ్చే భరోసాన్నే డిజిటల్ బుక్

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సోమవారం డిజిటల్ బుక్‌ను నేతలు ఆవిష్కరంచారు. కార్యక్రమం, అద్దంకి, బల్లికురవ, మేదరమెట్ల, సంతమాగులూరు, జే పంగులూరు మండలంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల సమన్వయకర్తలు, పట్టణ అధ్యక్షుడు, రాష్ట్ర, జిల్లా హోదాల్లో ఉన్న నాయకలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు అధిక సఖ్యంలో పాల్గొన్నారు.



బల్లికురవలో డిజిటల్ బుక్ ఆవిష్కరించిన పార్టీ శ్రేణులు



డిజిటల్ బుక్ ఆవిష్కరణలో పంగులూరు పార్టీ శ్రేణులు

సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం

- రేపటి నుంచి విధులు బహిష్కరించనున్న ఉద్యోగులు

వేటపాలెం: ప్రభుత్వం జేఏసీ నాయకులతో 30వ తేదీ లోపు చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని.. లేని పక్షంలో అక్టోబర్ 1న నుంచి సామాజిక పెన్షన్లను పంపిణీ చేయమని సచివాలయ వార్డు, గ్రామ జేఏసీ నాయకులు ఎంపీడీవో ఎం రాజేష్ బాబు, తహశీల్దార్ గీతా రాణికి సోమవారం వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోయలేని పనిభారాన్ని తమపై ప్రభుత్వం మోపుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించిన తమను ఇంటింటికి తిప్పుతూ వివిధ రకాల సర్వేల పేరుతో తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో సచివాలయ ఉద్యోగులు ఆందోళన బాటపట్టాల్సి వచ్చిందన్నారు.



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సమ్మె సైరన్ మోగించిన పీహెచ్‌సీ వైద్యులు

చీరాల రూరల్: గత ప్రభుత్వం ఇన్ సర్వీసు కోటాలో పనిచేస్తున్న వైద్యులు పీజీ కోర్సు చేసేందుకు వెయిటేజి మార్కులు అందజేసింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొలగించింది. అందుకు నిరసనగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వర్తించే వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. చీరాల నియోజకవర్గం పరిధిలోని ఐదు పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లూరు పరిసర వరద ప్రభావిత ప్రాంతాలలో విధులు నిర్వర్తించే నిమిత్తం సోమవారం ఆయా ప్రాంతాలకు తరలి వెళ్లారు. దీంతో అత్యవసర పరిస్థితులలో వైద్యశాలలకు వచ్చిన రోగులకు వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే అక్కడ విధులు నిర్వర్తించే వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది రోగులకు తూతూ మంత్రంగా వైద్య సేవలందించి పంపించారు. చీరాల నియోజవర్గంలో ప్రధానంగా ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఉంది. దానికి అనుగుణంగా పట్టణంలో మరియమ్మపేట, వైకుంఠపురం, పాపరాజుతోటలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. అలానే వేటపాలెం, పందిళ్లపల్లిలో పిహెచ్‌సీలు కూడా రోగులకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఆయా పీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులు జిల్లా కలెక్టర్ అప్పగించిన విధులలో పాల్గొనేందుకు వెళ్లడంతో రోగులు అవస్థలు పడ్డారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యులు సమ్మె పేరుతో తమ విధులకు డుమ్మా కొడితే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు

గుండె పరీక్షలు చేయించుకోవాలి

చీరాల రూరల్: ముప్పై ఏళ్లుపైబడిన ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి, ప్రేమ హాస్పటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావు సూచించారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో సోమవారం రోటరీ కమ్యూనిటీ హాల్లో ఉచిత గుండె జబ్బుల చికిత్సా శిబిరాన్ని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బాబురావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబురావు మాట్లాడుతూ.. ఈసీజీ, ఎకో, టీఎంటీ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలని సూచించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా 45 నిమిషాలు పాటు వాకింగ్‌తో పాటు వ్యాయామాలు చేయాలని చెప్పారు. శిబిరంలో 30 మందికి రక్తపోటు పరీక్షలుచేసి ఈసీజీ, ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాలాది కృష్ణ, ఇస్తర్ల సుభాషిణి, తిరుమలశెట్టి లక్ష్మీప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, బండారుపల్లి హేమంత్‌కుమార్, నక్కల సురేష్, శంకరరెడ్డి, గుద్దంటి రమేష్, శ్రీనివాసరావు, భానుకుమారి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఇస్తర్ల బాబురావు

అత్త, ఆడపడుచులకు కోర్టు జరిమానా

చీరాల రూరల్: కోడలిని కొట్టిన కేసులో అత్త, ఇద్దరు ఆడపడచులకు న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ. 1,000 జరిమానాలు విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు చీరాల ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావు తెలిపారు. చీరాలకు చెందిన ఇండ్ల పద్మలత, రాంప్రసాద్ భార్యా భర్తలు. వీరి కుటుంబంలో కలహాలు రావడంతో పద్మలత పాన్నూరులోని తన చెల్లెలు ఇంటివద్ద ఉంటుంది. ఈ క్రమంలో రాంప్రసాద్ పాన్నూరులో ఉంటున్న తన భార్య పద్మలత ఇంటికి వెళ్లి ఆమెకు చెప్పకుండా తన కుమారైను తీసుకుని చీరాల వెళ్లాడు. విషయం తెలుసుకున్న పద్మలత తన కుమారైను తెచ్చుకునేందుకు చీరాలలోని తన అత్తంటికి వెళ్లింది. అయితే పద్మలత అత్త కాశిక మల్లేశ్వరి, ఆడపడుచులైన మాధవిలత, సౌజన్యలు కలసి ఆమెపై దాడి చేశారు. తన అక్కను కొట్టవద్దని ఆమెకు రక్షణగా వచ్చిన ఆమె చెల్లెలు రజని, బసవయ్య అనే వ్యక్తిని స్తంభానికి కట్టేసి కొట్టారు. చుట్టు పక్కలవారు వారి బారి నుంచి విడిపించగా వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై మల్లికార్జున కేసు నమోదుచేసి విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో ఉన్న కేసును న్యాయమూర్తి కాత్యాయిని విచారించారు. నిందితులపై ఉన్న నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 1,000 జరిమానాలు విధించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలుపడే విధంగా సహకరించిన ఏపీపీ, పోలీసులను సీఐ అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలు శక్తి పెరుగుతుంది

పర్చూరు(చినగంజాం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మండల అధికారులు సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ ఏ వస్తువులపై జీఎస్టీ ఎంత తగ్గించారనే విషయమై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అలాగే షాపుల యజమానులు కూడా తగ్గించిన జీఎస్టీ పట్ల అవగాహన కలిగి ఉండి అమ్మకాలు సాగించాలని అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి నెలకు కనీసం రూ.1200 నుండి రూ.1500 వరకు భారం తగ్గుతుందన్నారు. జిల్లా సీటీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరువ అవ్వాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరక్టర్ షేక్ షంషుద్దీన్, వాణిజ్య విభాగం నాయకులు మామిడి పాక హరిప్రసాద్, బీజేపీ నాయకులు అడపాల కృష్ణ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ అభివృద్ధికి చేపట్టే పనులకు కౌన్సిలర్ సభ్యులు ఆమోదించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. పలు అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ ఆర్ఐ అర్జున్‌రావు చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ వార్డుల పునర్విభజనకు అభ్యంతాలు ఉంటే తెలియజేశాలని సభ్యులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిరల్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

జే.పంగులూరు: మద్యం తాగి బైక్ నడుపుతూ సర్వీస్ రోడ్‌లో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈఘటన సోమవారం రాత్రి మండలంలోని జాగర్లమూడివారిపాలెం దగ్గర జాతీయ రహదారిపై సర్వీసు రోడ్‌లో జరిగింది. అందిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన తెలగతోటి రాఘవరావు సోమవారం రాత్రి మద్యం తాగి బండి నడుపుతూ సర్వీస్ రోడ్‌లో వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాఘవరావు తలకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన రాఘవరావును 108 అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): మండలంలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన పల్లపు బాలాజీ అనే పేద విద్యార్థికి సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో దాత కొల్లా సాంబశివరావు అందజేశారు. విద్యార్థి బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని దాత సాంబశివరావు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు మానికొండ శ్రీనివాసరెడ్డి, ఏజీ నాగబైరు శ్రీనివాసరావు, బాలాజీ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు టీటీడీ కల్యాణ మండపం ప్రారంభం

పర్చూరు(చినగంజాం): తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో గ్రామ ప్రజల కృషి, పట్టుదల, తోడ్పాటుతో మండలంలోని నూతలపాడు గ్రామంలో కల్యాణ మండపం రూపుదిద్దుకుంది. సుమారు రూ 3.5 కోట్ల వ్యయంతో గ్రామంలో కల్యాణ మండపాన్ని నిర్మించారు. టీటీడీ నిధులు రూ.2 కోట్ల కేటాయించగా గ్రామ ప్రజలు రూ.60 లక్షల సహకారంతో, మరి కొంత కమిటీ సభ్యులు సొంత నిధులతో స్థానికంగా ఒక ఎకరా భూమిని కొనుగోలు చేసి టీటీడీకి స్వాధీనం చేయడంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం 20 మంది సభ్యులతో కళ్యాణ మండపం నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి 2023 జనవరి 13న శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణ వ్యయం సరిపోక పోవడంతో కమిటీ సభ్యులు దాతల సహకారం కోరి నిధులు రాబట్టారు. కళ్యాణ మండపం నందు వివాహాది శుభకార్యాలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేకంగా వంటశాల, సౌకర్యవంతంగా మరుగుదొడ్లు, వివాహ వేదిక వంటి ఆధునిక సౌకర్యాలతో నిర్మాణాన్ని పూర్తి చేసి అక్టోబరు 1 వ తేదీన ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రారంభోత్సవానికి మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.